క్లుప్తంగా

కెరీర్ గైడెన్స్‌తో విద్యార్థులకు మేలు



జరుగుమల్లి హైస్కూల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న కేంద్ర కమిటీ సభ్యులు

జరుగుమల్లి(సింగరాయకొండ): ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం విద్యార్థుల భవిష్యత్తు దిశానిర్దేశానికి ఎంతో ఉపయోగమని కేంద్ర ప్రభుత్వ కమిటీ సభ్యుడు ఆర్‌కే తాలుక్‌ధర్ పేర్కొన్నారు. జరుగుమల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాంపై కేంద్ర ప్రభుత్వ కమిటీ సభ్యులు సమీక్ష నిర్వహించారు. అనంతరం వైద్యారోగ్య సిబ్బందితో సమావేశమై విద్యార్థులకు అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర కమిటీ సభ్యులు సీతారాం మీనా, ఆర్‌జేడీ బి.విజయభాస్కర్, ఎస్.సుబ్బారావు, వెంకారెడ్డి, ఎంఈఓ బి.నాగేంద్రవదన్, డైట్ లెక్చరర్ రవీంద్ర, హెచ్‌ఎం మర్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సూరారెడ్డిపాలెం రైతుల భూ పత్రాలు పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ విశ్వేశ్వరరావు, తహసీల్దార్ చిరంజీవి

టంగుటూరు: రైల్వే మూడో లైను నిర్మాణంతో భూములు కోల్పోతున్న సూరారెడ్డిపాలెం రైతులతో ఆర్డీఓ విశ్వేశ్వరరావు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ప్రస్తుతం ఎకరాకు ప్రభుత్వం రూ.96 లక్షల ధర నిర్ణయించిందని తెలిపారు. 46 సెంట్ల భూమికిగాను ఒక్కో రైతుకు రూ.1.11 కోట్ల నగదు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి వచ్చిన 13 మంది రైతులతో మాట్లాడిన ఆర్డీఓ భూ పత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిరంజీవి, వీఆర్వోలు పాల్గొన్నారు.

పశువుల అంబులెన్సును వినియోగించుకోండి



రైతులతో మాట్లాడుతున్న జేడీ బేబీరాణి

టంగుటూరు: ప్రభుత్వం పశువుల ఆరోగ్యం కోసం ఏర్పాటు చేసిన అంబులెన్సులను రైతులు అత్యవసర సమయాల్లో 1962 నంబరుకు ఫోను చేసి ఉపయోగించుకోవాలని పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బేబీరాణి సూచించారు. మండలంలోని వల్లూరు రైతు భరోసా కేంద్రాన్ని జేడీ శుక్రవారం తనిఖీ చేశారు. ఆహారం ద్వారా ముద్ద చర్మ వ్యాధి, జంతు సంక్షేమం, కేసీసీ లోన్లు సంబంధించిన స్టిక్కర్లు అతికించి రైతులకు అవగాహన కల్పించారు. పశువుల రవాణా సమయంలో తనిఖీలు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. రోడ్ల మీదకు పశువులను వదిలేయకుండా తగిన జాగ్రత్తలు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి నగదు

వెలిగండ్ల: వెలిగండ్ల గ్రామ పంచాయతీకి చెందిన మల్లెబోయిన నారాయణమ్మ గురువారం గుండెపోటుతో చనిపోయింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ టి. సురేష్‌బాబు కుటుంబాన్ని పరామర్శించారు. మట్టి ఖర్చుల నిమిత్తం తొలుత రూ. 10 వేల నగదును మృతురాలు కుమారుడు కృష్ణకు శుక్రవారం అందజేశారు. వైఎస్సార్ బీమా నగదు రూ. 1 లక్ష అందజేస్తామని తెలిపారు. కుటుంబానికి అండగా నిలుస్తామన్నారు. స్థానిక ఎంపీడీఓ టి. సుకుమార్ కుటుంబాన్ని సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ బొబ్బా మీనాక్షి పాల్గొన్నారు.

98 శాతం ఇ- క్రాప్ నమోదు



హనుమంతునిపాడు: గ్రామ సచివాలయ పరిధిలో 14 రైతు భరోసా కేంద్రాల కింద 98 శాతం ఈ క్రాపు నమోదు చేసినట్లు కనిగిరి డివిజన్ వ్యవసాయ అధికారి ఏడీఏ వెంకటరమణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో 14 రైతు భరోసా కేంద్రాల వ్యవసాయ సహాయకులకు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఇ- క్రాప్ బుకింగ్ 15,788 ఎకరాలోను, ఈకేవైసీ 13,528 ఎకరాల్లో పూర్తి చేశామన్నారు. 98 శాతం పూర్తి అయింది. మిగతావి కూడా పూర్తి చేయిస్తామన్నారు. ఇన్‌చార్జి ఏఓ గోపిక్రిష్ణ, వ్యవసాయ సహాయకులు భారతి, నవ్య, కాశయ్య, రబ్బరాని, సాయి, సంధాని, ఖాదర్, కల్యాణి, కొండలు శారద, ఆర్. సుప్రజ, సుప్రియ పాల్గొన్నారు.

శైవ క్షేత్రాల్లో శివరాత్రి శోభ



పామూరు: బొట్లగూడూరులోని కామాక్షీ, రామలింగేశ్వర ఆలయం



పామూరులోని వల్లీసమేత భుజంగేశ్వరస్వామి ఆలయం



గుడ్లూరు: శివరాత్రికి ముస్తాబైన కొత్తపేట శివాలయం



సీఎస్‌పురం : చంద్రమౌళేశ్వర స్వామి మూల విరాట్

సీఎస్‌పురం: మహాశివరాత్రికి శైవ క్షేత్రాలు సిద్ధమయ్యాయి. ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో శుక్రవారం మహాలక్ష్మీ హోమం వైభవంగా నిర్వహించారు. మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తులు పోటెత్తారు. భక్తులకు అన్నదానం చేశారు.

మండలంలోని పెదరాజుపాలెం, నలజనంపాడు, పామూరు పల్లి గ్రామాల కూడలిలో ఉన్న కూడలి సంగమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు పూజలు చేశారు. ఈ నెల 16 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోనలో శుక్రవారం నుంచే మహాశివరాత్రి సందడి మొదలైంది. జలపాతం వద్ద స్నానాలు చేసి త్రిముఖ దుర్గాదేవి, భర్గులేశ్వర, నగరేశ్వర, కాలభైరవ ఆలయాల్లో పూజలు చేశారు. సీఎస్‌పురంలోని పురాతన శివాలయం శ్రీ కామాక్షీ సమేత చంద్రమౌళేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి శ్రీకృష్ణ శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. మహా శివరాత్రి ఉత్సవాలను జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జెడ్పీటీసీ మేకల శ్రీనివాసులు, నారాయణస్వామి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి కోరారు. కుని ఆలయంలో పని చేసే సిబ్బందికి శుక్రవారం నూతన దుస్తులను పంపిణీ చేశారు. నారాయణ స్వామి ఆలయం వద్ద చేపట్టిన ఏర్పాట్లను జెడ్పీటీసీ మేకల శ్రీనివాసులు, కోవిలంపాడు సర్పంచ్ షేక్ ఖాదర్‌బీ బుజ్జి శుక్రవారం పరిశీలించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను, భక్తులు పొంగళ్ళు తయారు చేసే పొంగళ్ల షెడ్‌ను, అన్నదాన సత్రాలను పరిశీలించారు. ఎస్సై పి. అనీల్ కుమార్ సిబ్బందితో పర్యవేక్షించారు.

పీసీపల్లి: మండలంలోని అన్ని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. పెదయిర్లపాడు శ్రీ మల్లేశ్వర స్వామి, విఠలాపురం మొండోడు బండ దేవాలయం, వెంగళాపురం నది ఒడ్డున వెలసిన లింగాలకొండ, పెదాలవలస ఆలయాల్లో ప్రత్యేక క్యూలైన్లు, మంచి నీటి వసతి ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

గుడ్లూరు: స్థానిక పురాతన నీలకంఠేశ్వర ఆలయం, కొత్తపేట గ్రామంలో ఉన్న శివాలయం, ఆర్బీ అగ్రహారంలోని శివాలయాల్లో తెల్లవారు జాము నుంచే పూజలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు పారా జనార్దన్, బొమ్మిశెట్టి కాశీవిశ్వనాథ్, కాపులూరి మాల్యాద్రి తెలిపారు. విద్యుత్ ప్రభను ఏర్పాటు చేస్తున్నారు. ఎస్సై ప్రసాదరెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు.

పామూరు: మండలంలోని శైవక్షేత్రాలు ప్రత్యేకశోభను సంతరించుకున్నాయి. స్థానిక వల్లీసమేత భుజంగేశ్వర స్వామి ఆలయం, అష్టాదశశక్తి, ద్వాదశ జ్యోతిర్లింగ ఆలయం, మండలంలోని బొట్లగూడూరులోగల శ్రీకామాక్షీసమేత రామలింగేశ్వరస్వామి, దాదిరెడ్డిపల్లెలోని పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి తదితర చోట్ల భక్తులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

మర్రిపూడి మండలంలో..

మర్రిపూడి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని కూచిపూడి, మర్రిపూడి, తంగెళ్ల, గుండ్లసముద్రం, కెల్లంపల్లి, అంధ్రరామలింగేశ్వర స్వామి శివాలయాలు నూతనశోభను సంతరించుకున్నాయి. కూచిపూడి రామలింగేశ్వరస్వామి ఆలయంలో లింగోద్భవ కాలంలో మహారుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు శుక్రవారం తెలిపారు.

కనిగిరి రూరల్: మహాశివరాత్రికి పట్టణంతో పాటు వివిధ గ్రామాల్లోన్ని శివాలయాల్లో ప్రత్యేక పూజలకు సర్వం సిద్ధం చేశారు. కొండపై కొలువై ఉన్న విజయమార్తండేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. నందనమారెళ్ల బాలకోటేశ్వర స్వామి దేవస్థానంలో పూజలు జరుగుతాయని కమిటీవారు తెలిపారు. శివహోం మహాశివరాత్రి జాగారణ ధ్యానోత్సవం పట్టణంలోని బోధి ధర్మ స్కూల్ ప్రాంగణంలో కనిగిరి పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో జరుగుతాయి.



మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో పూజలు




పీసీపల్లి: శివరాత్రికి ముస్తాబైన ఆలయం



ముస్తాబైన మర్రిపూడి శివాలయం



గుడ్లూరు: విద్యుత్ కాంతులతో గుడ్లూరులో పురాతన నీలకంఠేశ్వర ఆలయం



కనిగిరి: ముస్తాబైన విజయమార్తండేశ్వర స్వామి ఆలయం

24 నుంచి కొండపిలో పొగాకు వేలం



రైతులతో మాట్లాడుతున్న వేలం కేంద్రం అధికారి రామారావు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో 2023 సీజన్‌కు సంబంధించి ఈ నెల 24వ తేదీ నుంచి పొగాకు కొనుగోలు ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు వేలం నిర్వహణాధికారి ఎస్.రామారావు తెలిపారు. శుక్రవారం వేలం కేంద్రం పరిధిలోని రైతులతో సమావేశం నిర్వహించారు. వేలానికి సంబంధించి రైతులు తమ అభిప్రాయాలు తెలియజేయాలని వేలం కేంద్రం అధికారి సూచించగా.. రైతులు ఈ ఏడాది పొగాకు సాగు ఖర్చు 30 శాతం పెరిగిందని, గిట్టుబాటు ధర ఇచ్చేలా చూడాలని కోరారు. తొలి రౌండ్ నుంచే ఒక్కో బ్యారన్‌కు 4 బేళ్ల విక్రయానికి అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా మార్కెట్ పరిస్థితిని బట్టి బేళ్లు పెంచుకోవడం, తగ్గించుకోవడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. అదే విధంగా గిట్టుబాటు ధర ఇవ్వాలని వ్యాపారులను కోరారు. అనంతరం వేలం కేంద్రం అధికారి మాట్లాడుతూ.. బయట పొగాకు కొనుగోళ్లపై సమాచారం ఇవ్వాలని రైతులకు సూచించారు. కొంత మంది వ్యాపారులు మార్కెట్‌ను బలహీన పరచడం కోసం బయట పొగాకు కొనుగోలు చేస్తున్నారని, రైతులు గమనించి అక్రమ పొగాకు కొనుగోళ్లను నిరోధించేందుకు బోర్డుకు సహకరించాలని కోరారు. సమావేశంలో పొగాకు బోర్డు సభ్యుడు బొడ్డపాటి బ్రహ్మయ్య, ఎస్‌జీఓ సాయి, వ్యాపారులు, రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్లో సమస్యలు పరిష్కరిస్తాం



ఎంపీడీఓ జమీవుల్లాతో సమావేశమైన సాంఘిక సంక్షేమ శాఖ డీడీ దానయ్య

సింగరాయకొండ: స్థానికప్రభుత్వ ఎస్సీ కళాశాల బాలికల వసతి గృహంలో సమస్యలను కలెక్టర్ దినేష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ, కొండపి ఏఎస్‌డబ్ల్యూఓ యు.దానయ్య పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన ఎంపీడీఓ జమీవుల్లాతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మాట్లాడుతూ.. హాస్టల్ వాచ్‌మెన్‌గా గోవిందమ్మకు బదులు వేరొకరిని నియమించామని, అయితే వార్డెన్ జగదీశ్వరి ప్రవర్తనతో నెల రోజుల్లోనే ఆమె మానేసిందన్నారు. గతంలో చీరాలలో వార్డెన్‌గా పనిచేసేటప్పుడు కూడా వార్డెన్ తీరుతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారని, ఆమెను ప్రశ్నించిన అధికారులపై కేసులు కూడా బనాయించిందని చెప్పారు. ఆమె ప్రవర్తనపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేసి, సస్పెండ్ చేయాలని సిఫార్సు చేస్తానన్నారు. విద్యార్థినులను తాత్కాలికంగా మండల కాంప్లెక్స్‌లోని బీసీ బాలికల హాస్టల్లోకి మార్చడానికి కలెక్టర్‌కు నివేదిక పంపించామన్నారు.

ఉగాది నాటికి ఇళ్లు నిర్మించాలి



సింగరాయకొండలో గృహ నిర్మాణాలపై సమీక్షిస్తున్న ప్రత్యేకాధికారి చంద్రశేఖరరెడ్డి

కొండపి: మండలంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల లక్ష్యం ఉగాది నాటికి పూర్తి చేయాలని అధికారులకు మండల ప్రత్యేక అధికారి కె.అన్నపూర్ణ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సాయంత్రం సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని 19 జగనన్న కాలనీలతోపాటు వ్యక్తిగతంగా స్థలాలు ఉండి ప్రభుత్వం నిధులతో ఇళ్లు నిర్మించుకునేవారిని ప్రోత్సహించి లక్ష్యం పూర్తి చేయాలని తెలిపారు. లబ్ధిదారులకు 893 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 200 ఇళ్ల వరకు పూర్తయి తెలిపారు. ఉగాది నాటికి లబ్ధిదారులు మరో 150 ఇళ్లు నిర్మించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నాడు-నేడు పనుల తోపాటు గడపగడపకు మన ప్రభుత్వం పనులు సైతం వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య, పీఆర్ ఏఈ ప్రసాదరావు, హౌసింగ్ ఏఈ భూపతి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సింగరాయకొండ: మండలంలోని జగనన్న కాలనీల్లో గృహాల నిర్మాణాన్ని ఉగాది పండుగ నాటికి పూర్తి చేసేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖరరెడ్డి అధికారులకు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణ లక్ష్యాలపై సమీక్ష నిర్వహించారు. మండలంలో ఉగాది నాటికి 277 గృహాలను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఇప్పటి వరకు 67 గృహాల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మిగిలిన 210 గృహాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఎంపీడీఓ షేక్ జమీఉల్లా, గృహ నిర్మాణ శాఖ ఏఈ నాగరాజు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

50 మందికి వైద్య పరీక్షలు

హనుమంతునిపాడు: ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మిట్టపాలెంలో నిర్వహించిన వైద్య క్యాంప్‌లో 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వివిధ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రతాపురెడ్డి, వైద్య సిబ్బంది, 104 వాహణ వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

పామూరు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కంబాలదిన్నె ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ గద్దే ఏడుకొండలు అన్నారు. కంబాలదిన్నెలో శుక్రవారం 56 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. సాధారణ వ్యాధులకు, సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న వారికి రోగులకు ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు ఆలకూరపాడు విద్యార్థిని



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

టంగుటూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంతర జిల్లాల స్కూల్ గేమ్స్ అండర్-14 బాలబాలికల వాలీబాల్ క్రీడా పోటీలు ఈ నెల 14 నుంచి 16 వరకు పల్నాడు జిల్లా నరసరావుపేట డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రకాశం జిల్లా జట్టు తరఫున ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు సుదర్శి పూజిత, కసుకుర్తి లక్ష్మికళ్యాణి, వాకా హేమావతి ప్రాతినిధ్యం వహించారు. అత్యుత్తమ ప్రతిభ చూపిన సుదర్శి పూజిత రాష్ట్ర జట్టుకు ఎంపికై మే నేలలో జాతీయ స్కూల్ గేమ్స్ వాలీబాల్ పోటీల్లో పాల్గొనున్నట్లు హెచ్‌ఎం మహాలక్ష్మి తెలిపారు. శిక్షణ ఇచ్చిన పీడీ వెంకట్రావును ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

నేడు ఎమ్మెల్యే బుర్రా పర్యటన ఇలా..

కనిగిరి రూరల్: మహా శివరాత్రి పురస్కరించుకుని శనివారం ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ పలు ఆలయాల్లో జరిగే ప్రత్యేక పూజల్లో పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధి తెలిపారు. శనివారం ఉదయం 8.40 గంటలకు నందనమారెళ్ల శివాలయం జరిగే ప్రత్యేక పూజల్లో పాల్గొంటారని వివరించారు. అనంతరం 10.30 గంటలకు సీఎస్ పురం మండలం భైరవకోనలో ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 1 గంటకు మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో, 3 గంటలకు పెదరాజుపాలెం సంగమేశ్వరస్వామి ఆలయంలో, సాయంత్రం 5 గంటలకు పామూరు మండలం హనుమనగిరి ఆలయంలో, 6 గంటలకు పీసీపల్లి మండలంలోని శివాలయంలో, రాత్రి 9గంటలకు కనిగిరి మండలం పునుగోడు శివాలయంలో జరిగే విశిష్ట పూజల్లో ఎమ్మెల్యే బుర్రా పాల్గొంటారని తెలిపారు.

విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు

కనిగిరి రూరల్: పట్టణంలోని అన్ని వార్డుల్లో విద్యుత్ సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటానని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని కాశిరెడ్డి కాలనీలో శుక్రవారం విద్యుత్ సమస్యలపై ప్రజలు విన్నమించడంతో ఆయన విద్యుత్ సిబ్బందితో కలిసి పర్యటించారు. స్థానికులు వీధి లైట్లు, నూతన విద్యుత్ స్తంభాలు, శిథిలా వస్థలో ఉన్న విద్యుల్ పోల్స్‌ను గూర్చి చర్యలు తీసుకోవాలని తెలిపారు. సచివాలయ అధికారులు కాశీరాజు, మురళి కృష్ణ, అంజయ్య, మల్లయ్య, మన్సూర్ పాల్గొన్నారు.

110 మందికి వైద్య పరీక్షలు

సింగరాయకొండ: మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వర ఎస్సీ కాలనీలో శుక్రవారం ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా 110 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఇంటింటికీ వెళ్లి గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు చేసినట్లు వైద్యాధికారి చైతన్యకృష్ణ తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీ మనీషా, ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్ ఆలీ, హెల్త్ అసిస్టెంట్ శ్రీహరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జెడ్పీ స్థలంలో ఆక్రమణలు తొలగిస్తాం

జెడ్పీ డిప్యూటీ సీఈఓ హనుమంతరావు



అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ హనుమంతరావు

పొన్నలూరు: పొన్నలూరులోని జిల్లా పరిషత్ స్థలంలో ఆక్రమణలు తొలగించి, సర్వే చేపట్టి హద్దులు నిర్ణయిస్తామని జెడ్పీ డిప్యూటీ సీఈఓ హనుమంతరావు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సర్వే నంబర్లు 264, 265, 266లోని 10.37 ఎకరాల జెడ్పీ స్థలంలో ఆక్రమణలపై సమీక్షా సమావేశం నిర్వహించి, రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఈఓ హనుమంతరావు మాట్లాడుతూ.. జెడ్పీ స్థలంలో అక్రమ కట్టడాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. అందులో భాగంగానే క్షేత్రస్థాయిలో స్థలాన్ని, రికార్డులను పరిశీలించామన్నారు. అయితే సర్వే నంబర్లు 264, 265, 266లో కొంత స్థలాన్ని స్థానికులు 38 మంది ఆక్రమించుకుని గృహాలు నిర్మించి పట్టాల కోసం 2002లో ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం వారి దరఖాస్తులను పరిశీలించి జీవో ఎంఎస్ నంబర్ 336ను ప్రత్యేకంగా జారీ చేసి ప్రభుత్వ భూమిని జిల్లా పరిషత్ స్థలంగా మార్పు చేసిందన్నారు. దీంతోపాటు అప్పటి మార్కెట్ ధర ప్రకారం రుసుం కట్టించుకుని ఇందులో 30 మందికి పట్టాలు మంజూరు చేశారన్నారు. అలాగే మిగిలిన 8 మంది కూడా కొన్ని రోజుల తర్వాత పట్టాల కోసం కోర్టును ఆశ్రయించారన్నారు. అయితే జెడ్పీ స్థలం తరచూ ఆక్రమణకు గురవుతునట్లు ఫిర్యాదులు వస్తుండటంతో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు ప్రత్యేకంగా సర్వే చేపట్టి ఆక్రమిత జెడ్పీ స్థలాన్ని గుర్తించి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రధానంగా 2002లో పట్టాలు పొందిన వారు వారికి కేటాయించిన స్థలానికి, గృహాల నిర్మాణానికి సబంధించిన హక్కు పత్రాలను చూపించాలన్నారు. ఒకవేళ కేటాయించిన స్థలం కంటే ఎక్కువగా ఆక్రమించి గృహాలు నిర్మించి ఉంటే సర్వే అనంతరం తగు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే సర్వే నంబర్ 267లో మొత్తం 18.65 ఎకరాల పట్టా భూమి ఉందని, ఇందులో హైస్కూల్ నిర్మాణానికి దాత దేవరపల్లి అంకిరెడ్డి 3.50 ఎకరాలు ఇచ్చారని, దీన్ని కూడా సర్వే చేసి హైస్కూల్ స్థలం ఆక్రమణకు గురై ఉంటే చర్యలు తీసుకుని హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సర్వే నంబర్‌లోని రైతులు కూడా వారి హక్కు పత్రాలను చూపించాలన్నారు. మొత్తంగా జెడ్పీ స్థలాన్ని ఆక్రమణకు గురికాకుండా కాపాడతామన్నారు. సమావేశంలో సర్వే ఏడీ గౌస్‌బాషా, తహసీల్దార్ శైలేంద్రకుమార్, ఎంపీడీఓ రత్నజ్యోతి పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న జూదరుల అరెస్ట్

కనిగిరి రూరల్: పట్టణంలోని శంఖవరం పొలాల్లోని చిల్ల చెట్లల్లో పేకాట ఆడుతున్న నల్గురు వ్యక్తులను శుక్రవారం సెబ్ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ 8,920 నగదు, రెండు మోటార్ బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఎస్‌కే అబ్దుల్ జలీల్ తెలిపారు.